# ఇన్స్పిరేషన్ గురించి రెండు ముక్కలు



ఐరనీ ఆఫ్ లైఫ్ అంటే యిదేస్మీ వెంకటేశం--కాకపోతే ఏవిఁటి చెప్పు. లాస్టియరీ సీజన్‌లో నేనెక్కడున్నాను.... కోడంబాక్కంలోని పెలేషియల్ బిల్డింగులో, హోరున కురుస్తున్న వానచూస్తూ ఫ్రెంచి విండోపక్క నిలబడ్డ నాకో మంచి విడో పక్కనుంటే మహాకావ్యాలు రాయగల్ననిపించింది. తీరా ఈ రోజున రెండు వరాలూ, గ్రాంటు అయ్యాయి గాని.... ఏవిఁలాభం. అన్నీ ఉన్నాయిగానీ ఐదోతనం తక్కువన్నట్లు.... ఛ. అవాచ్య మప్రతిహతమగుగాక.... దేవుడు వరమిచ్చాడు గాని పూజారిణీ బుచ్చెమ్మ వదిన ఆమోదించటం లేదు. నా కేవిఁలే మధ్యన, లోకానిక్కాసిని మహాకావ్యాలు లభించకుండా పోతాయి.... కాళిదాసు పిక్చరు చూశావోలేదో గాని అది చూస్తే అతగాడి కీలకం తెలిసింది. అంథా వైఫ్ వైపు ఇన్‌స్పిరేషనే నష. నేనప్పుడే అనుకున్నా. ఎంత కాళిదాసైనా ఒంటి చేత్తో ఇంత ఘనమైన బుక్కు లెక్కడ రాయగల్డులే అడచ్చెయి జేసుకో పోతేనూ అని....

చూశావూ చూశావూ కాళిదాసు పేరెత్తగానే కవిత్వం తన్నుకొస్తోంది. మైడియర్ వెంకటేశం! ఇప్పుడు నీకీ రెయిన్ అనగా, వర్షం యలా కనిపిస్తోందోయ్! భూలోకంలోని బ్యూటిఫుల్ యంగ్ విడోస్ కోసం దేవతలు హోరున దు:ఖాశ్రువులు రాలుస్తున్నట్లు కనబట్టం లేదూ? మీ సిస్టర్ మనసులో గాఢంగాను ఫేసులో లీలగాను గోచరించే భావాలను ప్రకృతే నటించి పెడుతోందోయ్, కాని ప్రదర్శించేందుకు భావాలుండి, ప్రదర్శించగల ప్రజ్ఞ కూడా ఉన్న మీ సిస్టరు నేటి సినిమా యాక్టర్లలా ప్రకృతినీ సెట్టింగునూ తోడుగా వాడుకోవడం శుష్కదండగ సుమీ.

మన సినిమా యాక్టర్లయితే బాధ, ఆవేదనవంటి మనస్థితులను గాఢంగా ప్రదర్శించవలసి వస్తే ఎన్నో హంగులు చేసుకుంటారు. కామెరా టిల్ట్‌లు చేయిస్తారు. గిర్రున తిప్పుతారు, సూపరింపోజులో రైళ్ళు పరుగెత్తినట్లు చూపిస్తారు. మొహంమీద గిర్రున తిరుగుతున్న పంకా నీడలు చూపిస్తారు. ఇవన్నీ చాలక అరవై వయొలిన్‌లు, ఇరవై క్లారినెట్ల నేపథ్యప్పాటలతో గొడవ చేయిస్తారు. ఇన్నీ చేసినా భలానా పాత్ర చాలా బాధపడుతోంది, గావున దేవుడా మవవున్నూ దు:ఖించాలి గాబోలు అన్న జ్ఞానం ప్రేక్షకులకు కలగటం లేదట - మరి అంచేతను గావును ఇటుపై సినిమాలో ఈ ఏడుపు సీనులూ గట్రా నడుస్తున్న సమయంలో అది చూస్తున్న ప్రేక్షకుల్ని కుట్టిందికి నల్లుల్నీ,గిల్లీ రక్కిబాధ పెట్టిందికి కిరాయి జవానుల్నీ పెడతారట.

అప్పటికూ్కడా తెరమీద నటులబాధ చూసి జాలిపడలేని మొండి ఘటాలుంటే, వాళ్ళ అయినవాళ్ళో కానివాళ్ళో హరీమన్నారని వాళ్ళ చెవుల్లో వూది భోరున ఓ సారి ఏడిపించి కళ్ళు తుడుస్తారట. ఇది కూడా డైరెక్షను యాక్టింగు కళలో భాగవేఁ, కానీ గిరీశంలాంటి డైరెక్టరాక్టరూ, బుచ్చెమ్మలాటి బ్రహ్మాండమైన నటీ వడికడితే ఇవన్నీ శుష్క దుండుగే. అసలపుడు మేం చూపించడానికి లోకంలో ఉన్న బాధంతా చాలదు. లోకంలో ఉన్న ఆనందం అంతా పోగేసినా మాకు ఒక ఎక్స్‌ప్రెషన్‌కి చాలదు, ఏవిటనుకున్నావో మరి....

యేవిటోయ్ వెంకటేశం, నేను ఎప్పుడూ మూడ్‌లోకి రాను, రాక రాక వచ్చి పుంజుకొని అక్షరలక్షలయిన ఉపన్యాసాలిస్తూ ఉంటే మీ సిస్టరలా వెళ్ళిపోతుందీ! విన్నది కాస్త కాస్త హరాయించుకొన్నాక మరి కాస్త విందావనా!....

యవరూ ఫాదరిణ్లా గారా! అంటే పూజనీయులనిలెండి! దయచెయ్యండి-- హరాయించుకోవడం--అనగా డైజేషన్ గురించి మీవాడికి లెక్చరిస్తున్నాను. ఇది సైన్సు లెండి, అబ్బో దొరలకఖ్ఖర్లేని విషయం లేదు.... అదే అదే ఇలా మసాబుగా ఉన్నరోజున కాస్త తిండి, చిరుతిండి తగ్గించుకోవాలనిన్నీ లేకపోతే అరగదనిన్నీ చెబుతున్నాను.... తిండి చిరుతిండి సయిజుకి తగ్గాలి. మరి చిరుతిండి కూడనే కూడదనుకున్నారు ఎల్ఫిన్‌స్టన్ దొరవారు.

చిత్తం మీరన్నది విలువైనముక్కే కానీండి. ఈ కాలప్పిల్లలలా హరాయించుకోలేరు. వీళ్లంతా కుర్రసజ్జు. వఠ్ఠి అర్భకులు....

....ఎవడండీ అంత మాటంటా, తమవంటివారింట ఆశ్రయం పొందుతూ వెధవ టెంటు సినిమా మానేజర్ని చేబదులడగడం నాకేం ఖర్మవండీ, ఏదో పొరబాటైయుండాలి, ఆఁ. ఏంకాదూ,నిన్నగామోసు అలా షికారు కెళ్తే వాడు గనబడి బలవంతాన టీ గట్రా పట్టించి ఈ గవర్నమెంటు యక్సయిజున్నూ, దానివల్ల హాలువాళ్ళకి పడే సుంకం గురించిన్నీ అడిగాడు. ఆ వేడిలో సర్కారువాడికి చెమ్డా లెక్కదీసి మరీ నాలుగూ అనేశాను. ఎదట లేకపోయాడుగాని ఉంటే డంగై పోయేవాడు. ఆ పైన పన్నులూ ఒన్నులూ పడితే నీకేమయ్యా మహారాజాలా జనం నెత్తికి తోసెయ్. టిక్కెట్టు పెంచి పారేయ్. అటు సర్కారువాడి ముందు నీ ఆబోరు దక్కుతుంది. ఇటు అడ్డమైన చెత్తసినిమాలనీ చూసి మన ఇండస్ట్రీని చెడుదారిలో నడుపుతున్న ప్రేకకులకి జుల్మానా వేసినట్టున్నూ ఉంటుంది అన్నాను.

అంతే, వాడానందం పట్టలేక ఉక్కిరిబిక్కిరైపోయి కాళ్ళమీద పడ్డంత పని చేశాడు. నా ఋణం తీర్చుకోలేనన్నాడు. అనక అయిదూ పదీ కావలిస్తే ఋణం పట్టికెళ్ళమన్నాడు. ఒద్దుమొర్రో అగ్నిహోత్రావధాన్లు గారు నీ డొక్క చీలికల్జేయించేస్తారని నేనూ, కాదు మొర్రో అని వాడూ, చివరికి నాకు తెలీకుండా నా కమీజు కేవన్నా అంటించేశాడు గావును. ఆ నోటలాగే నాతోబాటు వచ్చి ఉండాలి. ఇచ్చేద్దాం లెండి. మీ రిమ్మన్నారని పిన్నిగారి నడిగుచ్చుకుని వాడి యదాన కొడతానదెంత సేపు.

* * * *

తరువాత మరొక్క విషయవండి, నిన్ననే మనవి చేద్దామనుకున్నాను. సర్కారువాళ్ళు నావంటి జీనియస్‌లు మంచి ఫిలిములు తియ్యడం కోసవ(ని బాంకిలో ఇరవై లక్షల్జాగర్జేశారట, వచ్చి కావలసింది తీసుకుని అఖండవైన కళాఖండవోటి తీసుకోవలసిందని ఉత్తర్వైంది పై నించి. అంచేత బహుశా నేను రెండ్రోజుల్లో బయల్దేరాల్సొంటుంది. సర్కార్నించి మణియార్డర్రాగానే -మని యార్డరే వస్తుందో మనిషే రొక్కం పట్టించుకొస్తాడో చెప్పలేననుకోండి.

ఏవన్నారూ! అందరికీ ఇస్తారా అనా, అహ(వారనడం అలాగే అంటున్నారు. అయితే ముందస్తుగా తలాతోకాఉన్న ఓ కథా, దాని కమామీషూ కాగితమ్మీద పెట్టి చూపించిన మీదటనే డబ్బు చేతిలో పడుతుందని షరతు. నావంటి పెద్దవాళ్ళక్కాదనుకోండి. ఏం,అంచేత డబ్బాశవున్న ఏ ప్రొడ్యూసరు ఆపని చేయగల్డు. అసలు కథలకే దిక్కులేదు. పై పెచ్చు తలాతోకాఉన్న కథ తెమ్మంటే ఎలా తెస్తాడు. నిజానికి నవ్వుకుంటున్నారు ఇండస్ట్రీలో అంతా. ఇదెన్నడేనా కన్నావా( విన్నావా( విడ్డూరం గాపోతే, సినిమా తియ్యకుండానే కథేవిటంటే ఎలా చెప్పగలం అవ(టాని.

అంచేత చెప్పొచ్చిందేవిటంటే, నాకా మనియార్డరొచ్చేలోగా తవరో హస్తం ......

చిత్తం..చిత్తం..దానికేం అలాగే,తర్వాత మాట్టాడదాం.

